సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

లింగంపల్లి అండర్‌ బ్రిడ్జి, మంజీరా రోడ్డు సమస్యలపై 'మీతో సాక్షి' కార్యక్రమంలో ముక్తకంఠంతో నినదించిన ప్రజలు





లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద మీతో సాక్షి కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు



దీర్ఘకాలికంగా లింగంపల్లి అండర్‌ బ్రిడ్జి వద్ద చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోతుండడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. అలాగే మూడు దశాబ్దాల క్రితం వేసిన మంచినీటి పైప్‌లైన్‌ నిత్యం లీకేజీలతో రోడ్డుపై ఏరులై పారడంతో మంజీరా రోడ్డు గుంతలమయంగా మారింది. నూతన పైప్‌లైన్‌ వేసినా, కొత్త రోడ్డు నిర్మాణం జరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు 'మీతో సాక్షి' ఆయా ప్రాంతాల్లో ప్రజలను కలిసింది. ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించేందుకు 'సాక్షి దినపత్రిక' ఆధ్వర్యంలో లింగంపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రజలు భారీ ఎత్తున పాలుపంచుకున్నారు. లింగంపల్లిలో దశాబ్దాల నుంచి తమ సమస్యలెవరూ పరిష్కరించడం లేదంటూ జనం ముక్తకంఠంతో నినదించారు. ఏటా కోట్ల రూపాయలు వెచ్చించినా, ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ ప్రాంతంలో పర్యటించినా, అండర్‌బ్రిడ్జిని పరిశీలించినా ఎలాంటి పరిష్కారం చూపలేకపోయారన్నారు. చిన్నపాటి వర్షానికే రాకపోకలు నిలిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఆర్‌ఓబీ నిర్మాణం చేపడితేనే రాకపోకలకు ఎలాంటి సమస్య ఉండదని, ప్రయాణం సాఫీగా ఉంటుందని అందరూ అభిప్రాయపడ్డారు. అలాగే ఇంజనీర్స్‌ ఎన్‌క్లేవ్‌ వద్ద మంజీరా పైప్‌లైన్‌ రోడ్డు సమస్యలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

– శేరిలింగంపల్లి/హఫీజ్‌పేట

4 కోట్ల పనులతో ఉపయోగం లేదు..



లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద రూ.4 కోట్లతో చేస్తున్న పనులతో ఉపయోగం లేదు. నాలాపై ఉన్న స్లాబ్‌లను పగులగొట్టి బిళ్లలు వేశారు. దానిలో పూడిక తీయలేదు. తాత్కాలిక పనులతో ఉపయోగం లేదు. ఆర్‌ఓబీ నిర్మాణంతోనే శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

–బద్దం కొండల్‌రెడ్డి, అధ్యక్షులు, పాపిరెడ్డి కాలనీ

ఎమర్జెన్సీ సమయాల్లో ఇబ్బందులు..



అత్యవసర సమయాల్లో లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్‌ జాం కావడం వల్ల ఇబ్బందిపడుతున్నాం. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో గంటల తరబడి ట్రాఫిక్‌లో ఉండాల్సి వస్తోంది. ప్రభుత్వం శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలి.

– ఉమా చంద్రశేఖర్, శివాజీనగర్



అంబులెన్స్‌లకు ఇబ్బందే..



ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని తరలించేందుకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయి. వర్షం వస్తే స్కూల్‌ బస్సులను కూడా మళ్లించాల్సి వస్తోంది. ఈ రోడ్డులో భారీ భవనాలకు అనుమతులు ఇచ్చే ప్రభుత్వం అందుకు తగ్గ మౌలిక వసతులు కూడా కల్పించాలి.

– శ్రీనివాస్‌ నాయక్‌

వర్షం వస్తే రాకపోకలు బంద్..



లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద వర్షం వస్తే రాకపోకలు నిలిచిపోతాయి. పటాన్‌చెరు, రామచంద్రాపురం, భెల్, చందానగర్‌ తదితర ప్రాంతాల నుంచి గచ్చిబౌలి, మెహిదీపట్నం వైపు వెళ్ళేందుకు ఇదే ప్రధాన రహదారి. లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు 54 దూర ప్రాంత రైళ్లతో పాటు ఎంఎంటీఎస్‌ ప్రయాణికులకు కూడా నిత్యం ఇబ్బందులు కల్గుతున్నాయి. వీటికి శాశ్వత పరిష్కారం రైల్వేఓవర్‌ బ్రిడ్జితోనే సాధ్యం.

– తాడిబోయిన రామస్వామియాదవ్, మాజీ కౌన్సిలర్‌



వెంటనే రోడ్డు పనులు చేపట్టాలి



మంజీరా పైప్‌లైన్‌ రోడ్డు సంవత్సరం నుంచి పూర్తిగా గుంతలమయంగా మారింది. పట్టించుకునే వారు కరువయ్యారు. ఏళ్ళ తరబడి రోడ్డు మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వాలు మారుతున్నాయి.. కానీ రోడ్డు తీరు మారడం లేదు.

–బాబు మోహన్‌ మల్లేష్, మదీనాగూడ

పైప్‌లైన్‌ రోడ్డులో భారీ వాహనాలను నిషేధించాలి



మంజీరా పైప్‌లైన్‌ రోడ్డులో భారీ వాహనాలను నిషేధించాలి. జాతీయ రహదారికి ప్రత్యామ్నాయ రోడ్డుగా పైప్‌లైన్‌ రోడ్డు ఉంది. హఫీజ్‌పేట్‌ నుంచి లింగంపల్లికి వెళ్ళాలంటే పైప్‌లైన్‌ రోడ్డు త్వరగా వెళ్ళడానికి వీలుగా ఉంటుంది. ఒక్కసారిగా వాహనాలు రావడంతో పైప్‌లైన్‌ రోడ్డు కూడా ట్రాఫిక్‌ జామ్‌ అవుతుంది.

–అరవింద్, ఇంజనీర్స్‌ ఎన్‌క్లేవ్‌

5 కిలోమీటర్లు నరకం..



లింగంపల్లి బీహెచ్‌ఈఎల్‌ చౌరస్తా నుంచి హఫీజ్‌పేట్‌ ఫ్లైఓవర్‌ వరకు పైప్‌లైన్‌ రోడ్డు పూర్తిగా గుంతలు పడింది. దీంతో ద్విచక్ర వాహనాలు ,కార్లు వెళ్లాలంటే అరగంట పడుతుంది. పైప్‌లైన్‌ రోడ్డు అంటే నరకానికి దారి అన్నట్లుగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయంతో వెళ్తున్నాం.

–జనార్దన్‌గౌడ్, స్థానికుడు

ప్రమాదాలకు నిలయంగా..



పైప్‌లైన్‌ రోడ్డు గుంతలుపడడంతో రాత్రి సమయాలలో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వీధి దీపాలు లేవు. గతుకుల రోడ్డులో ప్రమాదాల అంచున ప్రయాణం సాగిస్తున్నారు. గత ప్రభుత్వం పైప్‌లైన్‌ వేస్తే కొత్తగా వచ్చిన ప్రభుత్వం రోడ్డు వేయకుండా కాలయాపన చేస్తుంది.

– వీ. హరీష్‌రావు, రామకృష్ణనగర్‌

బైక్‌ల చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్‌

- 24 కేసుల్లో నిందితులు
- వివరాలను వెల్లడించిన మాదాపూర్‌ ఏసీపీ శ్రీకాంత్‌



బైక్‌ల చోరీ కేసు వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్‌ ఏసీపీ సీహెచ్‌ శ్రీకాంత్‌

గచ్చిబౌలి: ముసుగులు ధరించి బైక్‌లు చోరీ చేసిన కేసులో ఇద్దరిని అరెస్ట్‌ చేసినట్లు మాదాపూర్‌ ఏసీపీ సీహెచ్‌ శ్రీకాంత్‌ తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 5న రాత్రిపూట హెల్మెట్‌ ధరించి ఒకరు, ముసుగు వేసుకొని ఒకరు నడుచుకుంటూ వెళ్లి ఎన్‌ఫీల్డ్, యమహా బైక్‌లను చోరీ చేసిన విషయం తెలిసిందే. సీసీ ఫుటేజీల ఆధారంగా చోరీకి పాల్పడిన కిషన్‌బాగ్‌కు చెందిన డ్రైవర్‌ సర్దార్‌ కరణ్‌వీర్‌ సింగ్‌(24), బీకేగూడలో నివాసం ఉండే స్విగ్గీ డెలివరీ బాయ్‌ సర్దార్‌ జాగ్‌ జోత్‌సింగ్‌(23)లను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. కారులో వచ్చి ఇద్దరు కారును దూరంగా పార్క్‌ చేసి బైక్‌లను చోరీ చేసి ఉడాయించారు. నిర్మానుష్య ప్రాంతంలో బైక్‌లను ఉంచి తిరిగి కారు తీసుకొని బీదర్‌కు పరారయ్యారు. కరణ్‌వీర్‌ సింగ్‌పై పంజగుట్ట, హుమయూన్‌నగర్, బేగంబజార్, చిక్కడపల్లి, సంగారెడ్డి టౌన్‌ పీఎస్‌ పరిధిలో ఏడు బైక్‌ చోరీ కేసుల్లో నిందితుడుగా ఉన్నారు. జాగ్‌ జోత్‌సింగ్‌ మియాపూర్, మాదాపూర్, చందానగర్, ఆర్సీపురం, కేపీహెచ్‌బీ, జీడిమెట్ల, కూకట్‌పల్లి పీఎస్‌ పరిధిలో రాత్రి పూట ఇళ్ల తాళాలు పగుల గొట్టి చోరీలకు పాల్పడిన 23 కేసుల్లో, ఒక ఎన్‌డీపీఎస్‌ కేసులో నిందితుడిగా ఉన్నాడు. కొద్ది రోజుల క్రితమే జాగ్‌ జోత్‌ సింగ్‌ జైలు నుంచి బెయిల్‌ పై వచ్చారు.. జైల్లో ఇద్దరు పరిచయం కావడంతో బైక్‌లు చోరీ చేయాలని ప్లాన్‌ వేసుకున్నారు. సుదర్శన్‌నగర్‌లో రెక్కీ నిర్వహించి హాస్టల్‌ ముందు పార్క్‌ చేసిన బైక్‌లను గమనించి ఎత్తుకెళ్లారు. ఇద్దరు కలిసి చేసిన మొదటి కేసులోనే గచ్చిబౌలి పోలీసులకు పట్టుబడడం గమనార్హం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. విలేకరుల సమావేశంలో గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్‌ హబీబుల్లా ఖాన్, డీఐ రాజేష్, ఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

'ఇగ్నో' ప్లానింగ్‌ బోర్డు మెంబర్‌గా హెచ్‌సీయూ ప్రొ.వెంకటరమణ

రాయదుర్గం: ఇందిరాగాంధీ నేషనల్‌ ఓపెన్‌ యూనివర్సిటీ (ఇగ్నో) ప్లానింగ్‌ బోర్డు సభ్యుడిగా హెచ్‌సీయూ స్కూల్‌ ఆఫ్‌ మేనేజ్‌మెంట్‌ స్టడీస్‌ ప్రొఫెసర్‌ వి వెంకటరమణను నియమించారు. మూడేళ్ల కాలపరిమితితో ఆయన విధులను నిర్వహిస్తారు.'ఇగ్నో' ప్లానింగ్‌ బోర్డు అనేది విశ్వవిద్యాలయం కార్యక్రమాలు, కార్యకలాపాల రూపకల్పనకు బాధ్యత వహించే అపెక్స్, ప్రిన్సిపల్‌ బాడీగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

సకల జనులు సుభిక్షంగా ఉండాలి

కాంగ్రెస్‌ నేత నీలం మధు ముదిరాజ్‌

పటాన్‌చెరు టౌన్‌: సకల జనులు సుభిక్షంగా ఉండాలని కాంగ్రెస్‌ నేత నీలం మధు ముదిరాజ్‌ అన్నారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆంధ్ర రాష్ట్రం శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు.

క్రీడాకారిణికి సన్మానం

చందానగర్‌: చందానగర్‌ పీజేఆర్‌ స్టేడియంలో కుంగ్‌ఫూలో శిక్షణ తీసుకొని ఇటీవల పటాన్‌చెరులో నిర్వహించిన జాతీయ కరాటే, కుంగ్‌ఫూ పోటీలలో ట్రోఫీ సాధించిన పూజితను శుక్రవారం హోప్‌ ఫౌండేషన్‌ కార్యాలయంలో చైర్మన్‌ కొండ విజయ్‌కుమార్‌ సన్మానించారు. కుంగ్‌ఫూ కోచ్‌ లక్ష్మణ్‌ను అభినందించి రూ.5వేల నగదు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్‌లో అధ్యాపక్‌ జూనియర్‌ కాలేజీ ప్రారంభం



కళాశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్‌: మాదాపూర్‌ డివిజన్‌ పరిధిలోని మాధవనగర్‌ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అధ్యాపక్‌ జూనియర్‌ కళాశాలను శుక్రవారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్‌ లక్ష్మీనారాయణ గౌడ్, జనార్దన్‌గౌడ్, ప్రసాద్, రఘునాథ్, బాలు, శ్రీధర్‌గౌడ్, మురహరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

చందానగర్‌ : వేమనకాలనీ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్‌ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌ రెడ్డి పేర్కొన్నారు.

◆ పీజేఆర్‌ ఫీడర్‌ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పీజేఆర్‌ ఏరియా, పీజేఆర్‌ రోడ్డు 1,3,5,7, 10,12,13, లగ్జరీ అపార్ట్‌మెంట్స్, రిలయన్స్‌ వెనుక ఉన్న జనప్రియ అపార్ట్‌మెంట్స్‌ ఏరియాలలో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ భాస్కర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు టీఎన్‌జీఓస్‌ కాలనీలో, ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, సాయిఐశ్వర్య కాలనీ, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు జర్నలిస్ట్‌ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా నిలిపేస్తున్నామని, అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్తీక పౌర్ణమి వేడుకలు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శివ నామస్మరణతో పరిసరాలు మారుమోగాయి. తెల్లవారుజామునుంచే ఆలయాల్లో అర్చనలు, పంచామృతాభిషేకాలు చేశారు.

– శేరిలింగంపల్లి జోన్‌ బృందం











సరికొత్త అభ్యాస కేంద్రంగా ఆర్టస్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌



ప్రారంభోత్సవ కార్యక్రమంలో నిర్వాహకులు, అతిథులు

రాయదుర్గం: ఆర్టస్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌ తన మొదటి క్యాంపస్‌ను కోకాపేట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ స్కూల్‌లో సీబీఎస్‌ఈ, కేంబ్రిడ్జ్‌ సిలబస్‌ సమ్మేళనాన్ని అందిస్తుంది. శుక్రవారం పాఠశాల లోగో, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్‌ స్టాఫ్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇండియా కన్వెన్షన్‌ సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాఠశాల నిర్వాహకుడు, విద్యావేత్త డాక్టర్‌ ప్రసన్న మండవ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయడంలో సాంప్రదాయ పద్ధతులు చాలా తక్కువగా ఉన్నాయని, ఆర్టస్‌ సమగ్రమైన, విలువ ఆధారిత విధానాన్ని ప్రారంభించామన్నారు. సహ వ్యవస్థాపకుడు నాగతుమ్మల మాట్లాడుతూ వైవిధ్యమైన అభ్యాస విధానాలు, సాంకేతిక అభ్యాసం ద్వారా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు, ఓక్రిడ్జ్‌ వికాస్, ఓయూ పాఠశాలలను సమర్థవంతంగా సాగిస్తామన్నారు.పాఠశాల ప్రతినిధి రాజ్‌ యార్లగడ్డ మాట్లాడుతూ ప్రపంచస్థాయి పాఠశాల వాతావరణాన్ని ఇక్కడ అందిస్తున్నామన్నారు. చదువుకునే విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు ఈ పాఠశాల సరికొత్త అభ్యాస కేంద్రంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఆర్‌ఎస్‌ అధికారులు కరుణాకరరావు, మహేష్‌ లంకిపల్లి, అనిరుధ్‌ రెడ్డి, యశస్విని మండవ, నితిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ఆటాపాట అదుర్స్‌

ఘనంగా హెచ్‌సీయూ క్యాంపస్‌ స్కూల్‌ 41వ వార్షికోత్సవం



హెచ్‌సీయూ క్యాంపస్‌ స్కూల్‌లో అలరించిన నృత్యప్రదర్శనలు



రాయదుర్గం: ఆటాపాటలతో విద్యార్థులు అబ్బురపరిచారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో క్యాంపస్‌ స్కూల్‌ 41వ వార్షికోత్సవాన్ని గురువారం రాత్రి క్యాంపస్‌లోని డీఎస్‌టీ ఆడిటోరియంలో నిర్వహించారు. వేడుకలను హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్‌ బీజేరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలన్నారు. అనంతరం వివిధ పోటీలలో విజేత విద్యార్థులకు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. హెచ్‌సీయూ క్యాంపస్‌ స్కూల్‌ చైర్మన్‌ ఆచార్య సంజయ్‌ సుభోధ్, వైస్‌చైర్మన్‌ బ్రహ్మానందరెడ్డి, ప్రిన్సిపల్‌ పి మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.